ప్రజాశక్తి

గురువారం 13 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



సమృద్ధిగా భూగర్భ జలాలు

- పెరుగుతున్న నీటి మట్టాలు
- వినియోగం 27శాతమే..!

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. ఎండలు మండుతున్నా, ఈ వేసవిలో భూగర్భ జలాల నిల్వలకు కొదువ ఉండదు. 2021-22 నీటి సంవత్సరంలో నిర్వహించిన సర్వేలో భూగర్భ జలాల నీటి లభ్యత సంతృప్తికరంగా ఉన్నట్లు భూగర్భ జలశాఖాధికారులు గుర్తించారు. భౌగోళికంగా జిల్లాలో 4,292 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని 24 మండలాల్లో వర్షాలు అనుకూలంగా పడ్డంతో భూగర్భ నీటి మట్టాలు పెరుగుతున్నాయి. జిల్లా సాధారణ వర్షపాతం 1175.44 మిల్లీమీటర్లకు, 1277 మిల్లీమీటర్లు కురిసింది. కురిసిన వర్షాలు భూమిలో ఇంకడం, నీటి వనరుల వినియోగం తక్కువగా ఉండడంతో భూగర్భ జలాలు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో భూగర్భ జలాల నీటి లభ్యత 72,097.55 హెక్టామీటర్లకుగానూ తాగునీరు, పరిశ్రమలు, వ్యవసాయానికి కలిపి 19,631.11 హెక్టామీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. నీటి లభ్యతలో 27.23 శాతం మాత్రమే వినియోగించడంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. మునగపాక మండలంలో

మిగతా 2లో..

నీటి కొరత ఉండదు

భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో వేసవిలో నీటి సమస్య ఉండదు. జిల్లాలో వర్షాలు కురవడం, నీటి లభ్యత కంటే తక్కువ వినియోగం ఉండడంతో భూ గర్భజలాలు సంతృప్తికరంగా ఉన్నాయి. నీటి లభ్యతలో 27 శాతం మాత్రమే వినియోగం ఉంది.



జి.శ్రీనివాసరావు, భూగర్భజల అధికారి, అనకాపల్లి జిల్లా

సుబ్బారావుకు ఘన నివాళి

తరలివచ్చిన రాజకీయ నాయకులు



సంతాప సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/గాజువాక

'ఆఖరి క్షణం వరకూ ఉద్యమమే ఊపిరిగా జీవించిన కమ్యూనిస్టు, ప్రజలతో గొప్ప అనుబంధం గల నాయకుడు జి సుబ్బారావు' అంటూ పలువురు సిపిఎం నేతలు ఆయన్ను కొనియాడారు. బుధవారం ఉదయం శీలానగర్‌లోని అతని స్వగృహానికి సమీపంలోగల పోస్టాఫీసు గ్రౌండ్స్‌లో గాజువాక సిపిఎం నాయకులు జి.సుబ్బారావు సంతాప సభ అత్యంత ఘనంగా జరిగింది. వందల సంఖ్యలో ఆయన అభిమానులు, ట్రేడ్ యూనియన్, ఇతర సంఘాలకు చెందిన కార్యకర్తలు, సిపిఎం నాయకులు తరలి వచ్చారు. సుబ్బారావు అమర్‌రహే... ఉద్యమాలు జిందాబాద్ అంటూ అక్కడకు వచ్చిన సిపిఎం, సిఐటియు శ్రేణులంతా నినాదాలు చేశారు. సభా వేదికపై ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో వివిధ పార్టీల నాయకులు ఘనంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సుబ్బారావులోని కమ్యూనిస్టు అంకితభావాన్ని అభినందించారు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంతో కూలిపోతుందని నమ్మిన సుబ్బారావు కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న ధృఢ సంకల్పంతో తన జీవిత కాలం కృషిచేశారన్నారు. సోషలిజానిదే భవిష్యత్ అని ఆయన నమ్మారని, అందుకు తగ్గట్టుగానే ప్రపంచం మారుతుందని అమెరికా, వెనిజులా వంటి దేశాల్లో పలు పరిణామాలు రుజువు చేస్తున్నాయని ఉటంకించారు. విశాఖ అంటేనే ప్రభుత్వరంగంపై ఆధారపడి ఉన్నందున ఇదొక ఫైనాన్షియల్ కేపిటల్‌గా

మిగతా 2లో..



నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, సిహెచ్.నర్సింగరావు తదితరులు

విశాఖ ఉక్కుపై కేంద్రం కొత్త నాటకం : వి.శ్రీనివాసరావు

వార్త మెయిన్‌లో..

1998 డిఎస్‌సి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు

వార్త 2లో..

సిపిఐ, సిపిఎం ప్రచార భేరిని జయప్రదం చేయండి

వార్త 4లో..



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ప్రజాప్రతినిధులు

రూ.11.89 కోట్లు ఈబీసీ నేస్తం విడుదల

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకం రెండవ విడత కింద విశాఖపట్నం జిల్లాలో రూ.11,89,65,000 మొత్తాన్ని చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండవ విడత ఈబీసీ నేస్తం పథకం ద్వారా జిల్లాలో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న 7931 మంది అగ్రవర్ణ పేదలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ పథకానికి సంబంధించి ఏమైనా సమస్యలుంటే సంబంధిత సచివాలయం దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి పూర్ణిమదేవి, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

విశాఖ సీపీ, అనకాపల్లి ఎస్‌పి బాధ్యతల స్వీకరణ

గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దుతా : సీపీ త్రివిక్రమవర్మ



ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ పోలీస్ కమిషనర్‌గా సిఎం.త్రివిక్రమవర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2005 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన త్రివిక్రమవర్మ 2023 జనవరిలో డిఐజి ఐజిగా ఉద్యోగోన్నతి పొందారు. గుంటూరు రేంజ్ ఐజిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన ఐపిఎస్‌ల బదిలీలలో భాగంగా విశాఖ పోలీస్ కమిషనర్‌గా వచ్చారు. విశాఖ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన త్రివిక్రమవర్మ గౌరవ వందనం స్వీకరించి, విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన చిరువోలు శ్రీకాంత్ సిఐడి ఐజిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సిపి త్రివిక్రమవర్మ మీడియాతో మాట్లాడుతూ, మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. విశాఖ నగరంలో 2015-16లో డిసిపిగా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. బాధ్యతలు చేపట్టిన త్రివిక్రమవర్మను డిసిపి-1 వి.విద్యాసాగర్‌నాయుడు, డిసిపి-2 కె..ఆనందరెడ్డి, క్రైమ్ డిసిపి జి.నాగన్న, సిసిఎస్ ఎడిసిపి సూర్య శ్రావణ్‌కుమార్, ఎస్‌బి ఎడిసిపి జి.గంగాధరం, అడ్మిన్ ఎడిసిపి రామకృష్ణంరాజు, దిశా ఎసిపి సిహెచ్. వివేకానంద, నార్త్ సబ్ డివిజన్ ఎసిపి చుక్క శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో వుంటా : ఎస్‌పి మురళీకృష్ణ



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి సమస్యనూ సునిశితంగా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని ఎస్‌పి కెవి మురళీకృష్ణ అన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్‌పిగా బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళిక ఉంటుందన్నారు. సమస్య మూలాలు తెలుసుకుంటే పరిష్కారం సులభమవుతుందని తెలిపారు. ఇక్కడి పరిస్థితులను పూర్తిగా తెలుసుకొని వాటి నియంత్రణకు కృషిచేస్తానన్నారు. పోలీసు విభాగాలన్నింటినీ సమన్వయం చేసుకొని మంచి ఫలితాలు రాబట్టేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. గంజాయి రవాణా, ట్రాఫిక్ తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. పోలీసు కుటుంబ సంక్షేమంపై దృష్టి పెడతానన్నారు. స్పందన, ఇతర పద్ధతుల ద్వారా ప్రజలకు లభిస్తున్న సేవలను పరిశీలించి, మెరుగైన సేవలందించడానికి తగిన కృషి చేస్తానని తెలిపారు. ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పిలు విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి..

సమృద్ధిగా భూగర్భ జలాలు

బోర్లు, బావులు ఎక్కువగా ఉండడంతో ఇతర మండలాలు కంటే ఈ మండలంలో నీటివినియోగం 52 శాతం ఉంది. అతి స్వల్పంగా నాతవరం మండలంలో 12 శాతం ఉంది. మునగపాక మండలంలో బోర్లు, బావులు 2,603 ఉన్నాయి. 2022 మార్చినాటికి 5.87 మీటర్లలో భూగర్భ జలాలు ఉండగా, ఈ ఏడాది మార్చి నాటికి 5.87 మీటర్లలో నీరు ఉంది.

జిల్లాలో భూగర్భ జలాల లభ్యత, వినియోగం వివరాలు (హెక్టామీటర్లలో)

మండలం	భూగర్భజలాల లభ్యత	వినియోగం	మిగులుజలాలు
అనకాపల్లి	2722.07	990.93	1731.14
అచ్యుతాపురం	2323.99	841.35	1482.64
బుచ్చయ్యపేట	3443.8	927.13	2516.67
చీడికాడ	2697.85	837.18	1860.67
చోడవరం	3407.59	1444.83	1962.76
దేవరాపల్లి	2442.09	516.71	1925.38
గొలుగొండ	1880.31	481.57	1398.74
కె.కోటపాడు	2741.03	672.06	2068.97
కశింకోట	3151.91	1349.97	1801.94
కోటవురట్ల	2791.46	1014.15	1777.31
మాడుగుల	5125.41	1118.08	4007.33
మాకవరపాలెం	2319.53	731.08	1588.45
మునగపాక	1935.07	1008.41	926.66
నక్కపల్లి	3907.14	714.23	3192.91
నర్సీపట్నం	2690.37	469.54	2220.83
నాతవరం	5378.01	634.97	4743.04
పరవాడ	1553.79	529.92	1023.87
పాయకరావుపేట	3934.16	1070.95	2863.21
రాంబిల్లి	2451.72	418.17	2033.55
రావికమతం	3208.31	669.27	2539.04
రోలుగుంట	1976.37	534.2	1442.17
ఎస్.రాయవరం	4367.95	1064.14	3303.81
సబ్బవరం	3057.83	845.51	2212.32
యలమంచిలి	2589.79	746.76	1843.03
మొత్తం	**72,097.55**	**19,631.11**	**52,466.44**

సుబ్బారావుకు ఘన నివాళి

భాసిల్లుతుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇక్కడ లేకపోతే విశాఖ పేరును ఊహించగలమా? అని ప్రశ్నించారు. సుబ్బారావు లాంటి వ్యక్తులు చేసిన పోరాటాల స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ రక్షణకు నడుం కట్టాలని, అదే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సుబ్బారావు పనిచేసి ఉద్యమాన్ని నిర్మించారన్నారు. ఈ ప్రాంతంలో 1000 ఎకరాల ఇనాం భూములను పెద్దలు కాజేయ్యాలని చూడగా వాటిని పేదలకు పంచేందుకు జరిగిన పోరాటంలోనూ సుబ్బారావుది కీలకపాత్రేనన్నారు. ఈ విషయంలో నాటి పత్రికల యాజమాన్యాలు ప్రభుత్వం, స్థానిక పెద్దలవైపు ఉండగా ఆనాడు గాజువాకలోని జర్నలిస్టులు మాత్రం తమ యాజమాన్యాల విధానాన్ని ఉల్లంఘించి పేదలకు అనుకూలంగా వార్తలు రాశారని కొనియాడారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, సుబ్బారావు గాజువాకకే కాకుండా విశాఖ పారిశ్రామిక లోకానికి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సుబ్బారావును తమ ఇంట్లో ఒక సభ్యునిగా చూసేవారమని, ఆయన మృతిచెందడంతో కుటుంబంలో వ్యక్తి కోల్పోయిన అంత బాధగా ఉందన్నారు. ఆయన కార్మికులకు చేసిన సేవలు మరువలేనివన్నారు. 2017లో తాను కార్పొరేటర్ ఉన్నప్పుడు సుబ్బారావు, తాను కలిసి షీలా నగర్ ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, బిహెచ్‌పివిలో పనిచేస్తూనే ఆటోనగర్ కార్మిక సమస్యలపై సుబ్బారావు పోరాటం చేశారన్నారు. భూ పోరాటాన్ని గాజువాకలో జయప్రదం చేశారని తెలిపారు. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా కరోనా సమయంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల సమస్యలపై పోరాటానికి విజయవాడ వచ్చారని గుర్తు చేశారు. సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బారావు ధన్యజీవి అన్నారు. శ్రామిక మహిళా కన్వీనర్ ధనలక్ష్మి మాట్లాడుతూ, సుబ్బారావు కార్మికవర్గ శత్రువుల గుండెల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పద్మ, వై.సత్యవతి, సిఐటియు నాయకులు అయోధ్యరాం, యు.రామస్వామి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, చందు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, క్రాంతి ప్రాపర్టీస్ అధినేత చిన్నరావు పాల్గొన్నారు.

1998 డిఎస్‌సి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 355 మంది 1998 డిఎస్‌సి అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం సాయంత్రం స్థానిక వివిఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. నియామక ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం అందరి బాధ్యత

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడం కోసం ఎవరు ముందుకు వచ్చినా స్వాగతిస్తామని, దీన్ని కాపాడటం అందరి బాధ్యత అని స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి అప్పారావు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 741వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ అమ్మకం బిడ్‌లో తాము పాల్గొంటామని, ప్లాంట్‌ను దక్కించుకొని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని బిఆర్ఎస్ పార్టీ ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇటువంటి ప్రయత్నం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం చేసి ఉంటే బాగుండేదన్నారు. రూ 3 లక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్‌ను ఆదాని, అంబానిలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ చర్యలను సాగనిచ్చేది లేదని స్పష్టంచేశారు. ఈ దీక్షల్లో యూనియన్ నాయకులు ద్వారపురెడ్డి ఈశ్వరరావు, అప్పలరాజు, గొడ్డి రమణ, అమ్మోరు, పేర్ల శ్రీరాములు, అప్పలరాజు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హష్మీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ నాయకులు వై.అప్పారావు ఆధ్వర్యాన హష్మీ 69వ జయంతిని నిర్వహించారు. హష్మీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడుతూ, కార్మికులు, కష్టజీవులు, శ్రామికుల హక్కుల కోసం అనేక కళారూపాలు సృష్టించి వీధినాటికను పోరాట ఆయుధంగా మలిచిన ప్రజా కళా సైనికుడు సఫ్దర్ హష్మీ అని పేర్కొన్నారు. ప్రజా కవులు, రచయితలు, ప్రజా కళాకారులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న పోరాటంలో కళారూపాల ద్వారా ప్రజల్ని చైతన్యం చేయాలని జిల్లా కార్యదర్శి ఎం.చంటి పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ జిల్లా నలుమూలల ఉన్న దళాలన్నీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు. ఈ జయంతి కార్యక్రమంలో స్టాలిన్, నాగేశ్వరరావు, వై.అప్పారావు, గంగాధర్, నీలకంఠం, వేణు, లక్ష్మి, సన్యసమ్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.



హష్మీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

'స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేది కెసిఆర్, కెటిఆర్'

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా కాపాడేది తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్ మాత్రమేనని బిఆర్ఎస్ నాయకులు జెటి.రామారావు అన్నారు. బుధవారం జగదాంబ జంక్షన్ వద్ద తెన్నేటి విశ్వనాథం విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు తెలుగు వారి హక్కు అన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎపి ప్రభుత్వం వెంటనే బటన్ నొక్కాలన్నారు. ఆదాని, పోస్కో గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ ప్రభుత్వం తరపున బిడ్ వేస్తుంటే, ఎపి ప్రభుత్వం వ్యతిరేకిస్తూ సహకరించడం లేదన్నారు. కొంతమంది బిజెపి నాయకులు స్టీల్‌ప్లాంట్ విషయంలో కుట్ర చూస్తున్నారని ఆరోపించారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు, జగన్ సాధించలేనిది కెసిఆర్ సాధించి చూపిస్తారని తెలిపారు.

విద్యార్థులకు విద్య, ఉద్యోగమే లక్ష్యం



దర్బార్ కార్యక్రమ పోస్టర్‌ను విడుదలచేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : తమ విద్యార్థులకు విద్య, ఉద్యోగం, ఉపాధి కల్పించి ఉజ్వల భవిష్యత్తుకు బాటవెయ్యడమే బాధ్యత అని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీ చైర్మన్ సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖ ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీలో సర్వజ్ఞ సంస్థ ఆధ్వర్యాన నెంబర్ 1 ఓటిటి సారథ్యంతో ఏప్రిల్ 28న నరవలోని తమ కాలేజీలో దేశ స్థాయి పెట్టుబడి దారులు, వెంచర్ క్యాపిటిస్టులు, అంతర్జాతీయ స్థాయి నిపుణులు, విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎంఎస్ఎమ్ఇ ముఖ్య అధికారులు, బ్యాంకు అధికారులు, యువపౌత్సాహికుల పారిశ్రామిక వేత్తలతో నెంబర్ వన్ స్టూడెంట్స్ దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఆసక్తి కలిగినవారు రిజిస్ట్రేషన్ కోడ్, పాస్‌ల కోసం 93925 02849ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వజ్ఞ సంస్థ సిఎమ్‌డి మంచాల సాయి సుధాకర్ నాయుడు, సిఇఒ డాక్టర్ డోలేనాథ్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన బిజెపి కార్యకర్తలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి 29వ వార్డుకు చెందిన బిజెపి కార్యకర్తలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దక్షిణ నియోజకవర్గం బిజెపి ఇన్‌ఛార్జి పల్లా చలపతి, నాయకులు పల్లా లక్ష్మి, ఒమ్మి వెంకట అప్పారావు, పాల శ్రీనివాస్, బొట్టా రాజుకు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, ప్రజలలో మార్పు కనిపిస్తుందని, ఈ సమయంలో కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఉరుకూటి గణేష్ పాల్గొన్నారు.

16 నుంచి ఐఎఫ్‌టియు జాతీయ మహాసభలు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) అఖిలభారత 7వ మహాసభలు ఈ నెల 16,17,18 తేదీల్లో తిరుపతిలో జరగనున్నాయని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జయమ్మ, శంకర్, దుర్గ, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖలో కేంద్ర స్టీల్ సహాయ మంత్రి పర్యటన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : కేంద్ర స్టీల్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగ్గాన్ సింగ్ కులస్తే గురువారం విశాఖలో పర్యటించనున్నారు. ఉదయం 5 గంటలకు ఢిల్లీలో బయలుదేరి 8:15 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఉదయం 10:30 గంటలకు పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగే ప్రధానమంత్రి రోజ్‌గార్ మేళాలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆర్ఐఎన్ఎల్ అధికారులతో, 3:45 గంటలకు స్టీల్‌ప్లాంట్ యూనియన్ల ప్రతినిధులతో సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి ఢిల్లీ తిరుగు ప్రయాణం కానున్నారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ పోరాటం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్లను పరిష్కరించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా తాము చేపట్టిన పోరాటాన్ని ఆపేది లేదని ఎపి జెఎసి చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి అన్నారు. జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీవో హోం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిఆర్‌సి సిఫార్సులు, పెండింగ్ డిఎలు, కొత్త పిఆర్‌సి కమిటీ ఏర్పాటు, జిపిఎస్ సహా ఉద్యోగుల ఆర్జితాలు బ్యాంకు ఖాతాలో జమ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ, ప్రతి నెలా ఒకటవ తేదీన జీతాలు, సిపిఎస్ రద్దు తదితర డిమాండ్లతో ఆందోళన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మీగడ శ్రీనివాసరావు, నాయకులు ఎస్ఎ.త్రినాధరావు, సిహెచ్‌వి.రమేష్, కెఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కులో బ్యాటరీ వాహనాల ప్రారంభం



బ్యాటరీ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సిసిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలలో బుధవారం 10 బ్యాటరీ వాహనాలను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సిసిఎఫ్) శ్రీకంఠనాథ రెడ్డి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఎల్లవేళలా కట్టుబడి ఉందన్నారు. దీనిలో భాగంగానే 10 బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. జూ పార్కులో కర్బన ఉద్గారాల తీవ్రతను తగ్గించడానికి ఈ వాహనాలు ఎంతో దోహద పడతాయన్నారు. 10 మంది వరకు సీటింగ్ సామర్థ్యం ఉన్న ఈ వాహనాలు సందర్శకులకు సురక్షితంగా ఆనందంగా గడిపేందుకు సహకరిస్తాయన్నారు. జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద కొన్ని, సాగర్ గేట్ వద్ద మరికొన్ని వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ క్యూరేటర్ జి.మంగమ్మ, డిఎఫ్ఒ లక్ష్మణ్, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సెక్షన్ అధికారులు రాజేష్, భారతి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చిన్నా, వేణుగోపాలరావు

ప్రజాశక్తి -ములగాడ : ఎండలు మండుతున్న నేపథ్యంలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఆదర్శ స్పోర్ట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో చింతలలోవ ఆదర్శ రాయల్ విద్యాలయ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా బుధవారం ప్రారంభించారు. సామాజిక సేవా దృక్పథంలో ఆదర్శ రాయల్ విద్యాలయ అధినేత దాసరి వేణు గోపాలరావు సౌజన్యంలో దీన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని చిన్నా అన్నారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు నాయుడు వీధిలో సారిపిల్లి గంగరాజు ఇంటి దగ్గరలో రూ. పది లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ బుధవారం శంకుస్థాపన చేశారు. 175 మీటర్లు పొడవు, 4 మీటర్లు వెడల్పుతో సిసి రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎఇఇ శ్రీరామ్మూర్తి , వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, స్థానిక నాయకులు సారిపిల్లి గంగరాజు, సారిపిల్లి సంతోష్, బోర గోవింద్, పాలిశెట్టి బుజ్జి, కాంట్రాక్టర్ సిరికి శ్రీను, 130 సచివాలయం అడ్మిన్ లక్ష్మణ్, హరి, రామకృష్ణ,పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- గాజువాక:పాత కర్నవానిపాలెం రామాలయం పునర్నిర్మాణ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వేద పండితులు రవికుమార్ శర్మ పర్యవేక్షణలో అర్చక బృందం బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. కెనెన్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నరసింగరావు, జ్యోతి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. 90 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో కోదండరాముడు, సుబ్రహ్మణ్యస్వామిలను దర్శించుకోవడానికి రోజూ అధికసంఖ్యలో భక్తులు వస్తారని నరసింగరావు తెలిపారు. కార్యక్రమంలో గొంతిన దేముడు, కరణం రామకృష్ణ, కన్నయ్య, నూకరాజు, అప్పలరాజు దంపతులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో పెరిగిన ఆదాయం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎంసి చైర్మన్ సూర్య నారాయణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి కారణంగా నే 2022-23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు వసూలు ద్వారా గణనీయంగా ఆదాయం పెరిగినట్లు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ అన్నారు. బుధవారం ఎఎంసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ, గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.3.38 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యం కాగా, రూ.4.26కోట్లు వసూలైందన్నారు. తగరపువలస రైతు బజారు నిర్మాణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయన్నారు. ఆనందపురం మార్కెట్‌ను రైతుబజారు తరహా అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 20 స్టాల్స్ స్థానంలో పెరుగుతున్న రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మరిన్ని అదనపు స్టాల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. హుదూద్ సమయంలో దెబ్బతిన్న పద్మనాభం వ్యవసాయ మార్కెట్ కమిటీ మినీగోదాం పైకప్పు పునరుద్ధరణకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు. భీమిలి ఎఎంసి కార్యాలయం ఆవరణలోని 2వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామునకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహకారంతో ఎఎంసిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, కార్యాలయ కార్యదర్శి ఐఎస్‌రాజు వర్మ, సూపర్‌వై ర్లు లక్ష్మీ చైతన్య, మేరీకుమారి, పలువురు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

అంబేద్కర్ జయంతి కరపత్రం ఆవిష్కరణ



మాట్లాడుతున్న అంబేద్కర్ సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించే అంబేద్కర్ 132వ జయంత్యుత్సవాల కరపత్రాలను సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఇంటి గురుమూర్తి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం- ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం' నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంబేద్కర్ భవన్ ప్రాంగణంలోనిగ్రంథాలయ ఆధునీకరణను విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం డాబా గార్డెన్స్ ఎల్ఐసి భవనం దరి అంబేద్కర్ విగ్రహం నుంచి అంబేద్కర్ భవన్ ప్రదర్శన, జయంతి సభ నిర్వహిస్తామన్నారు. అంబేద్కర్ లైబ్రరీని డిజిటలీకరణ చేసి, విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రభుత్వ సహకారంతో పేద విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బత్తుల గౌతంబాబు, ఉపాధ్యక్షుడు కె.సాధు, కార్యవర్గసభ్యులు అలమండ ప్రసాద్, ఎం.అప్పలకొండ(చంటి), ఆర్.శ్రీనివాసరావు, రాజాన సరస్వతి ,బి.పెద్దినాయుడు పాల్గొన్నారు

నకిలీ పత్రాలతో స్థలం రిజిస్ట్రేషన్ యత్నం

బాధితుల ఫిర్యాదుతో ఐదుగురు నిందితుల అరెస్ట్





పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ స్టాంప్‌లు, పక్కనే ప్రధాన నిందితుడు

ప్రజాశక్తి -మధురవాడ: మిధిలాపురి వుడా కాలనీలో ఓ ప్రయివేటు స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయానికి పెట్టిన ఐదుగురు వ్యక్తులను పీఎంపాలెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సిఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలిలావున్నాయి. ఢిల్లీకి చెందిన కె. శివరామకృష్ణ, వర ప్రసాద్‌కు మిధిలాపురి వుడాకాలనీలో 355 చదరపు గజాలు స్థలం ఉంది. ఆ స్థలాన్ని లేవుట్ ఏర్పాటు సమయంలో కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ స్థలంపై కొందరి కన్ను పడింది. ఈ క్రమంలో ఇన్‌కం ట్యాక్స్ ప్రాక్టీషనర్‌గా పనిచేస్తూ, లబ్ధిదారులకు బ్యాంకు రుణాలిప్పిస్తున్న కంచరపాలెం కప్పరాడ ప్రాంతానికి చెందిన ఎన్.రామకృష్ణ శివప్రసాద్, నగరంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఎం. జయశ్రీ, రెడ్డి శ్రీవిద్య, రావాడ సంధ్య, ఎ.వెంకటరమణలతో సంబంధిత ఖాళీ స్థలంపై కన్నేశారు. కొన్నాళ్లుగా ఖాళీ ఉన్న స్థలానికి సంబంధించిన వివరాలు తెలుసుకుని, సంబంధిత స్థల యజమాని మృతి చెందినట్లు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడంతోపాటు మృతునికి జయశ్రీ, శ్రీవిద్య ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. ఆ స్థలాన్ని ఎండాడ ప్రాంతానికి చెందిన వ్యక్తి ద్వారా అమ్మకానికి పెట్టారు. మధురవాడకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలుకు ముందుకు వచ్చి, రూ.1.5 కోట్లుకు మాట్లాడి, రూ.55లక్షలు అడ్వాన్స్ గా ఇచ్చారు. తీరా రిజిస్ట్రేషన్ కావలసిన పత్రాలు సిద్ధం చేయగా అవి నకిలీవి అని తెలిసి కొనుగోలుదారుడు ఇచ్చిన అడ్వాన్స్‌ను వెనక్కు తీసుకున్నాడు.కాగా అదే స్థలానికి సంధ్య, వెంకటరమణలతో చర్చించి పెందుర్తి ప్రాంతానికి చెందిన డి.మధుకు అమ్మకం పెట్టారు. తీరా రిజిస్ట్రేషన్ కు వచ్చేసరికి అవి నకిలీ పత్రాలుగా గుర్తించిన సదరు వ్యక్తి పిఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అవి నకిలీ పత్రాలుగా ప్రాథమికంగా అంచనాకు రావడంతో నిందితులుఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి పలు స్టాంప్స్‌తో పాటు పలు నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా అరెస్ట్‌చేసిన ఐదుగురు నిందితులలో ముగ్గురు గతేడాది నవంబర్‌లోనూ ఇలాగే నకిలీ పత్రాలు సృష్టించిన కేసులో అరెస్టయిన పాత నిందితులున్నారని సిఐ వెల్లడించారు.

నేరాలు ఘోరాలు

పలు చోట్ల రోడ్డు ప్రమాదాలు

-వ్యక్తి మృతి - ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఉద్దండపురం జంక్షన్ దాటిన తర్వాత తుని నుండి నక్కపల్లి వెళ్తున్న బైకును అదే మార్గం గుండా వస్తున్న కారు వెనుక నుండి ఢీకొంది. ఈ కారును వెనక నుండి మరో కారు వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైకిస్టు రాముకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెనుక కారులో ఉన్న సీతారామయ్య తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది రాము, శ్రీనివాస్ తెలిపారు.

పాయకరావుపేట: మండలంలోని నామవరం జంక్షన్ జాతీయ రహదారి అంబికా టీ టైం వద్ద లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి వ్యక్తి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... నామవరం గ్రామానికి చెందిన ఇసరపు సూర్యారావు (81) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అంబి కా టీ టైం వద్ద ఆగి ఉన్న కారును తుని నుంచి నక్కపల్లి వెళ్తున్న లారీ ఢీకొని, అక్కడే ఉన్న సూర్యారావును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ విల్లాలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం, విజయనగరం జిల్లా డెంకాడ మండలానికి చెందిన పి.కృష్ణబాబు బోయిపాలెం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా, స్థానికుల సమాచారం మేరకు పిఎం పాలెం నేరవిభాగపు ఎస్ఐ రంభ శ్రీనివాసరావు తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, ఆరో వార్డు మారికవలస సమీపంలో రామదుర్గ రెసిడెన్సీ విల్లాల సముదాయంలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. నిందితుడి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక కెమెరాతోపాటు నాలుగున్నర తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చిన ఉప్పాడలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చినఉప్పాడలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. మత్స్యకారుడు వాసుపల్లి నల్లయ్యకు చెందిన పూరింటిలో ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించి మంటలు రేగాయి. ప్రమాదసమయంలో ఇంట్లో ఉన్న నల్లయ్యను అక్కడున్న కొంతమంది యువకులు బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. ఐఎన్ఎస్ కళింగకు చెందిన అగ్నిమాపక సిబ్బంది, శకటంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసినట్లు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తెలిపారు. బుధవారం బాధిత కుటుంబాన్ని కార్పొరేటర్ కొండబాబు పరామర్శించారు.

సింహాద్రి అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను బుధవారం నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ దంపతులు పంచాయతీరాజ్ కమిషనర్ ఎ.సూర్యకుమారి దంపతులు విజయనగరం ఆర్‌డిఒ సూర్య కళ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ విత్రినాధరావు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనము చేసుకొని బేడ మండపం చుట్టూ ప్రదక్షిణము చేసి స్వామి అంతరాయాలను గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఇఒ త్రినాధరావు వీరిని శాలువాలతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి : సిపి

ప్రజాశక్తి- సింహాచలం: విశాఖలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవంతో పనిచేస్తానని నగర పోలీస్‌కమిషనర్ త్రివిక్రమ్ వర్మ అన్నారు. బుధవారం కుటుంబ సభ్యులతో సింహాద్రి అప్పన్న దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత విశాఖలో ఎటువంటి అలజడులు, అల్లర్లకు ఆస్కారం లేకుండా తగు చర్యలు చేపడతానన్నారు.

సిపిఐ, సిపిఎం ప్రచారభేరిని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నేత సత్యాంజనేయ

ప్రజాశక్తి - ములగాడ : కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 30వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే వామపక్ష ప్రచారభేరిని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ పిలుపునిచ్చారు. బుధవారం మల్కాపురం గ్రామమండలిలో మల్కాపురం, గాంధీగ్రామ్ శాఖల సిపిఐ సమావేశాలు ఆయా శాఖల కార్యదర్శులు జి.రామకృష్ణ, డి.మధుసూధనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యాంజనేయ మాట్లాడుతూ, బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టి, రాజ్యాంగం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు గుడాల రాంబాబు మాట్లాడుతూ, ప్రచార భేరిలో వామపక్ష పార్టీల కార్యకర్తలు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సిపిఐ సీనియర్ నేతలు పోతిన రాము, నూనెలు సూరిబాబు, సత్యానందరావు, వై కనక రాజు, జి సురేష్, ఇ.వలసన్న, బి హరినాథ్, గోవింద్ పాల్గొన్నారు

ప్రచారభేరి పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే దేశవ్యాప్త ప్రచారభేరి వాల్ పోస్టర్లను ఆపార్టీల మధురవాడ జోన్ కార్యదర్శులు డి అప్పలరాజు, వి సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. మధురవాడ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, దేశ సంపదను లూటీ చేసి కార్పొరేట్లకు కట్టబెట్టడం, ప్రజలపై మోయలేని భారాలను వేసి జీవనం దుర్భరం చేయడం వంటి అంశాలపై ఈ ప్రచారభేరి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకులు, ఎల్ఐసి, రైల్వే, విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుకు దారాధత్తం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, సిపిఎం, సిపిఐ ప్రచారభేరిలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యమంలో సిపిఐ నాయకులు ఎండీ బేగం, పి వెంకన్న, వి సన్నిపాత్రుడు, సిపిఎం నేతలు పి.రాజ్‌కుమార్, సిహెచ్.శేషు, డి. తులసి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వామపక్ష నేతలు

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న వెంకన్నచౌదరి

ప్రజాశక్తి -గాజువాక : తగరపువలస ఎన్ఆర్ఐ వైద్యకళాశాలలో మూడో సంవత్సరం మెడిసిన్ చదువుతున్న కొవ్వూరు ప్రాంతానికి చెందిన వైద్యవిద్యార్థినికి గ్లోసంస్థ, అమ్కానా సంస్థ తరపున సంస్థ ప్రతినిధి వెంకన్న చౌదరి రూ.20వేల ఆర్థికసాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని కావడం, వైద్యవిద్యకు అవసరమైన ఆర్థిక చేదోడుగా ఉండాలన్న సంకల్పంతో సంస్థ తరపున ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

అప్పన్న సేవకులకు నూతన వస్త్రాలు



వస్త్రాలు పంపిణీ చేసిన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు శ్రీనుబాబు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానంలో నిత్యం పల్లకి మోస్తూ స్వామి సేవలో తరిస్తున్న బోయలను బుధవారం సింహాచల దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు, విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. స్వామి సేవలో తరిస్తున్న వీరికి చేతనైన సాయం చేయడం, నూతన వస్త్రాలను అందించడం ఆనందంగా ఉందని గంట్ల శ్రీనుబాబు అన్నారు. కాగా ఏటా తమకు నూతన వస్త్రాలను ఇస్తు శ్రీనుబాబుకు బోయలు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఇంటింటా సమస్యలు తెలుసుకుంటున్న ఆనందకుమార్

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 58వ వార్డులో కోరమండల్ ఫెర్టిలైజర్ సిఎస్ఆర్ నిధులు రూ.25లక్షలతో పలు అభివృద్ధి పనులకు వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎదురువానిపాలెంలో రూ.18.20లక్షలతో సామాజిక భవనం, రూ.ఐదు లక్షలతో ఓపెన్ జిమ్, రూ.1.5లక్షలతో బోరుబావి పనులకు శంకుస్థాపన చేశారు. తదనంతరం ఎదురువానిపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులివిందల లావణ్య, వార్డు అధ్యక్షులు గులివిందల కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ (ఆల్ఫా), 59 వార్డు అధ్యక్షులు పుర్రె సురేష్, జెసిఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు, 90 వార్డు నాయకులు నమ్మి శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి.వి.రమణి, స్థానిక నేతలు ఎదురు.అప్పలస్వామి, డి.వేణుగోపాల రెడ్డి, కన్నబాబు, సుబ్బలక్ష్మి, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఫెర్టిలైజర్స్ ప్రతినిధులు ఇ.రంగనాయకులు, సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు,శ్రీకాంత్, సీనియర్‌మేనేజర్ పిల్లా నారాయణ పాత్రుడు, ముఖ్య భద్రతాధికారి వెంకటరమణ, సిఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్, ధర్మాల వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

20న ఎంపీల ఇళ్ల వద్ద పెన్షనర్ల భిక్షాటన



హష్మీకి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి -కంచరపాలెం: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఎంపీల ఇళ్ల వద్ద ఖాళీ పళ్లేలను మోగించి భిక్షాటన చేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ నేతలు కోరారు. బుధవారం హష్మీ భవన్‌లో యూనియన్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవలే మరణించిన సిఐటియు నేత జి సుబ్బారావుకు శ్రద్ధాంజలి ఘటించారు. పెన్షనర్ల సంఘానికి సుబ్బారావు చేసిన సాయం, సేవలను కొనియాడారు. తరువాత సర్దార్ హష్మీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అరుణ్‌జీ, హుస్సేన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హష్మీ జీవిత విశిష్టతను వివరించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలపై చర్చించారు.

ఈనెల 20న ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇపియస్ పెన్షనర్స్ అసోసియేషన్స్ పిలుపు మేరకు ఎంపీల ఇళ్ల వద్ద చేపట్టే నిరసనలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.సుధాకర్, జిల్లా కార్యదర్శి హుస్సేన్, రంగా, అరుణ్ జీ మాట్లాడారు.

మాకినేని బసవపున్నయ్యకు ఘననివాళి



మాకినేని బసవపున్నయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : మాకినేని బసవపున్నయ్య 31వ వర్ధంతిని తాటిచెట్లపాలెంలో ఘనంగా నిర్వహించారు అక్కయ్యపాలెం జోన్ సిపిఎం కన్వీనర్ రాజు, జోన్ నాయకులు గౌరీష్, జ్యోతి, సుందరమ్మ, లలిత తదితరులు పాల్గొని బసవపున్నయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంబిగా ముద్దుగా పిలిచే మాకినేని బసవ పున్నయ్య పార్టీ నిర్మాణ దక్షుడిగా, గొప్ప మార్క్సిస్టు మేధావిగా, దేశంలో కష్టజీవుల కోసం అహర్నిశలు కషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామన్నారు.

నలభై ఏళ్లు దాటితే కంటి పరీక్షలు తప్పనిసరి



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివాని కొడాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : నలభై ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ విధిగా కంటిపరీక్షలు చేయించుకోవాలని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ, జిఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణం ఆప్తమాలజిస్ట్, కన్సల్టెంట్ డాక్టర్ శివాని కొడాలి అన్నారు. సాధారణంగా ఆ వయస్సులో ఉన్న వారికి కంటి చూపు తగ్గి,, పొడిబారిన కళ్ళు, శుక్లం, గ్లకోమా, మధుమేహ రెటినోపతి, వయో సంబంధిత మాక్యులర్ క్షీణత వంటి కొన్ని కంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దృష్టి హాని, పార్శ్వదృష్టి లోపం, దృష్టిలో హెచ్చు తగ్గులు, ఫ్లోటర్లు, వక్రంగా చిత్రాలు చూడటం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు మరీ జాగ్రత్తగా ఉండాలన్నారు స్త్రీలకు మెనోపాజ్ సమయంలో హార్మోనులలో మార్పులు కూడా కంటి సమస్యలు ప్రేరేపించవచ్చన్నారు. వీటిని పరిగణంలోకి తీసుకొని 40 ఏళ్లు దాటిన వారంతా వార్షికంగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైజ్ఞానిక సంస్థ అన్ని రకాల కంటి రుగ్మతలకు సమగ్ర రోగ నిర్ధారణ, వైద్య, శస్త్రచికిత్స సేవలను అందిస్తుందన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం: భూసార పరీక్షల నివేదికల ఆధారంగా పంటలు, ఎరువుల సాగు యాజమాన్య పద్ధతులను పాటిస్తే తక్కువ మదుపులతో ఎక్కువ దిగుబడులు, ఆదాయం పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కె అప్పలస్వామి అన్నారు. బుధవారం వేములవలస రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు, మట్టి నమూనాల పరీక్షపై శిక్షణరనిచ్చారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులకు మట్టి నమూనా సేకరణ విధానాన్ని వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి మాట్లాడుతూ, ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకుని, దానికి అనుగుణంగా పంటలు వేసుకోవడం, సాగు పద్ధతులను పాటించడం ఎంతో మేలన్నారు. భీమిలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బొడ్డేపల్లి విజయప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ గ్రామ సహాయకులు క్షేత్ర స్థాయిలో మట్టి నమూనాల సేకరణలో విధిగా పాల్గొనడంతోపాటు రైతులకు అవగాహన కల్పించి, వారిని భాగస్వాములను చేయాలన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞానకేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని భూసార పరీక్ష ప్రాముఖ్యతనువివరించారు. ఉద్యానవన శాఖాధికారి మన్మధరావు, జిల్లా శిక్షణ అధికారి సిహెచ్.సుబ్రహ్మణ్యం ఎడిఎలు మాణికాంబిక, దేవి, ఎఒలు పాల్గొన్నారు.

రూ.13 కోట్లతో పినగాడి రోడ్డు నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి-పెందుర్తి : రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వేపగుంట నుంచి పినగాడి వెళ్లే ప్రధాన రహదారి పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ రహదారి విస్తరణ చేయడం ద్వారా నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణించే చోడవరం, సబ్బవరంతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లేవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. జాతీయ రహదారి అభివృద్ధి పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని, త్వరలో అవికూడా పూర్తవుతాయన్నారు. త్వరలోనే మిగిలిన అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వైసిపి ఎపుడూ వ్యతిరేకమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసిపి నాయకులు పాల్గొన్నారు

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు

ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఏపీ జేఏసీ అమరావతి భాగస్వామ్య సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగ పింఛనుదారుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై ఈ ఏడాది ఫిబ్రవరి 13న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన 50 పేజీల మెమోరాండంలో తెలియజేసిన డిమాండ్లన్నీ పరిష్కరించాలని కోరారు. ఒకటవ తేదీన జీతాలు, పింఛన్లు ఇవ్వాలని, 11వ పిఆర్‌సి ప్రతిపాదించిన స్కేల్స్ బయట పెట్టాలని, పెండింగ్ నాలుగు డీఏల ఎరియర్స్ చెల్లించాలని, పిఆర్‌సి ఎరియర్స్ చెల్లింపు, 12వ పిఆర్‌సి కమిషన్ను వెంటనే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు కొత్త డీఏలను విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని ప్రభుత్వానికి విన్నవించినట్లు చెప్పారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 15న మరణించిన, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబాలను పరామర్శించడం, 18న కలెక్టరేట్ల వద్ద సిపిఎస్ ఉద్యోగులు ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా, 20న సకాలంలో జీతాలు, పింఛన్లు ప్రభుత్వం చెల్లించనందున ఈఎంఐ కట్టాలని ఒత్తిడి, పెనాల్టీలు వేయకుండా బ్యాంకుల సందర్శన, 25న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా, 27న రిటైర్డ్ ఉద్యోగుల ఇళ్లు సందర్శన, పింఛన్లు అందని వారిని పరామర్శ, 29న గ్రామ వార్డు సచివాలయ సిబ్బందితో కలెక్టరేట్లు వద్ద ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు



అవార్డు అందుకుంటున్న సంజయ్ కుమార్ సిన్హా

ఎన్‌టిపిసి సింహాద్రికి ప్లాటినం అవార్డు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ ఎన్‌టిపిసి సింహాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి గోవాలో జరిగిన అపెక్స్ ఇండియా-గ్రీన్ లీఫ్ అవార్డు వేడుకల్లో ఎన్విరాన్‌మెంటల్ ఎక్సలెన్స్ కేటగిరీ కింద ప్లాటినం అవార్డు లభించింది. ఎన్‌టిపిసి సింహాద్రి పర్యావరణ రంగంలో చేస్తున్న కృషికి లభించిన ఈ అవార్డును సింహాద్రి గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, ఏజిఎమ్ డాక్టర్ విజయన్ షీల్, సర్టిఫికెట్ ఆఫ్ రికగ్నిషన్‌ను మంగళవారం అందుకున్నారు. ఎన్టీపిసి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ద్వారా చట్టబద్ధమైన సంస్థల ఆదేశాలను పాటించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సంస్థ అధికారులు తెలిపారు. ఎన్టీపీసీ సింహాద్రి ఫ్లై యాష్ వినియోగం యొక్క అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు మొట్టమొదటిసారిగా నానో కాంక్రీట్ అగ్రిగేట్ భవనాన్ని అభివృద్ధి చేసిందని వెల్లడించారు. సింహాద్రి గత 6 సంవత్సరాలుగా 100 శాతం కంటే ఎక్కువ బూడిద వినియోగాన్ని సాధిస్తోందని, ఎఫ్‌వై 2022-23లో, 50వేలు మెట్రిక్ టోన్లు ఫ్లై యాష్ దక్షిణాఫ్రికాకు ఎగుమతి చేయబడిందని తెలిపారు. సింహాద్రి 2022-23 ఆర్థిక సంవత్సరంలో 479.67 ఎమ్‌పి బయోమాస్‌ను ప్లాంట్, టౌన్‌షిప్ హార్టికల్చరల్ వ్యర్థాల నుండి 5.4 ఎమ్‌టి ఇంట్లో ఉత్పత్తి చేసిన గుళికలతో సహ-ఫైర్ చేసిందని వెల్లడించారు. దాదాపు 13.8 లక్షల చెట్లను నాటడం ద్వారా 90 శాతం కంటే ఎక్కువ మనుగడ సాధించారని తెలిపారు.



డిఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం నీలకంఠాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులపై దాడి చేసిన గ్రామ వాలంటీరు, వైసిపి నాయకులను వెంటనే అరెస్టు చేయాలని అనకాపల్లి డిఎస్‌పి మహేష్‌కు సోమవారం టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గునూరు మల్లునాయుడు ఆధ్వర్యాన బుధవారం గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు అనకాపల్లి డిఎస్‌పి కార్యాలయానికి చేరుకొని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్యాయత్నం చేసిన వారే తిరిగి తప్పుడు కేసులు పెడుతున్నారని, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, సర్పంచు వజ్రపు శ్రీను, మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, నీలకంఠాపురం గ్రామ మహిళలు పాల్గొన్నారు.

సుజల స్రవంతిని గాలికొదిలేసిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి- కశింకోట

ఉత్తరాంధ్ర ప్రజల జీవనాడి అయిన సుజల స్రవంతి ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని అడ్డాం గ్రామంలో బుధవారం జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి వైసిపి నిరంకుశ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగపడే సుజల స్రవంతి ప్రాజెక్ట్‌పై మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎందుకు ముఖ్యమంత్రిని అడగడం లేదని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వం రాగానే సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళి, నాయకులు కుంద్రపు అక్కు నాయుడు, చిరికి సన్యాసి నాయుడు, రెడ్డి కన్నబాబు, వర్మ, దుర్గా ప్రసాద్, ద్వారపు రెడ్డి సత్తిబాబు, ఆంధ్ర ప్రసాద్, అయ్యల నాయుడు, కచ్చుల్ల సత్తిబాబు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ

14నుంచి ప్రచార భేరిని జయప్రదం చేయండి

సునీత్ చోప్రా, సుబ్బారావుకు ఘన నివాళి



సునీత్ చోప్రా, సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐ సంయుక్తంగా ఈ నెల 14నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రచార భేరిని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు సునీత చోప్రా, సిపిఎం గాజువాక సీనియర్ నాయకులు జి సుబ్బారావు చిత్రపటాలకు పార్టీ సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, గండి నాయన బాబు, కర్రి అప్పారావు, డి.సత్తిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కష్టజీవుల కోసం నిర్బంధాలను అధిగమించి ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. నేడు కార్మికులు కష్టజీవులను పణంగా పెట్టి మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఈ విధానాలను తిప్పి కొట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను, ధరల పెరుగుదలను వివరించి ప్రజా పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, జి కోటేశ్వరరావు, ఎం అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, ఆర్ రాము, వివి శ్రీనివాసరావు, ఈశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల అధికారి కల్పనా కుమారి

అభినందన సభలో కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తన విధులను ఎంతో నిబద్ధతతో చేశారని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అభినందించారు. ఇంతవరకు ఇక్కడ జేసీగా చేసిన కల్పనకుమారి బదిలీపై సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిగా వెళ్తున్న సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నిర్వహించిన కల్పనా కుమారి అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్టతరమైన పనులను కూడా సులభతరంగా అధికారులచే చేయించే నైపుణ్యం ఆమెలో ఉందన్నారు. జిల్లాలో రీ సర్వే పనులను అత్యంత వేగవంతంగా జరగడంలో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు. జెసి కల్పనకుమారి మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్‌గా అనకాపల్లి జిల్లాలో పనిచేయడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. డిఆర్‌ఓ వెంకటరమణ, ఆర్డీవో చిన్ని కృష్ణ, ఎస్‌డిసి అనిత, డ్వామా పిడి సందీప్, ఆర్ఎస్ఏ అధ్యక్షులు, మాడుగుల తహశీల్దారు రత్నం, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ జయరాం, సిపిఓ రామారావు, డిపిఓ శిరీష రాణి, మత్స్యశాఖ డిడి లక్ష్మణరావు, డీఈవో మహాలక్ష్మమ్మ, ఎస్డీసీలు రమామణి, జ్ఞాన వేణి, జిల్లా రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కల్పనాకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులు

ఆసరా సొమ్ము వ్యక్తిగత ఖాతాలకు జమచేయాలి


ప్రజాశక్తి-కశింకోట : వైఎస్ఆర్ ఆసరా పథకం సొమ్మును డ్వాక్రా మహిళల వ్యక్తిగత ఖాతాలను జమ చేయాలని మండల సమాఖ్య ఎపిఎ ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మండలంలో తాళ్లపాలెం ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ప్రసన్నను ఆయన బుధవారం కలిసి మాట్లాడారు. బ్యాంక్‌లో ఒక సిబ్బందిని ఆసరా వర్కు నిమిత్తం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ సమాఖ్య సిఎలు, లీడర్లుపాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ సీత పైడినాయుడు, ఎంపీటీసీ సీత వరలక్ష్మి సన్యాసి నాయుడు ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండలు కాస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి-చోడవరం : గాండ్ల తెలుకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా దూది సత్తిబాబు, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అత్తిలి జగన్నాధరావు నియమితులుకాగా, వారికి స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుధవారం నియామక పత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి కార్పొరేషన్ డైరెక్టర్లగా నియమించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. గాండ్ల తెలుకుల సంఘం అనకాపల్లి జిల్లా కన్వీనర్ డాక్టర్ పెబ్బులి రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవక సత్యారావు, వైసిపి నాయకులు పప్పల జయదేవ్, పళ్ళ నరసింహారావు, బొడ్డేటి సూర్యనారాయణ, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఒరుగంటి నెహ్రూ, నాగులపల్లి రాంబాబు, బొడ్డు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.



కొత్త డైరెక్టర్లను సత్కరించిన ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ఘనంగా మహావీర్ 2599 జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహావీర్ 2599 జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం గొల్ల వీధి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భక్తి గీతాలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పండ్లు బిస్కెట్ ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బల్ల నాగభూషణం, ఉపాధ్యక్షులు నిలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, కష్టమోహన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింహేశ్వరి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశువుల యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి-కోటపాడు : మండలంలోని సింగన్నదొరపాలెంలో వేసవిలో పశువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు జి బైరాగి ఆధ్వర్యంలో బుధవారం పశువిజ్ఞానబడి కార్యక్రమం నిర్వహించారు. పశుగ్రాసం పెంపకం, పశువుల చూడి పరీక్షలు, గొడ్డుమోత పశువుల పరీక్షలు నిర్వహించారు. ఆయన వెంట పశువైద్య సహాయకులు బుచ్చిబాబు ఉన్నారు

డైట్ కళాశాలలో వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నాలుగో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ అత్యుత్తమ ప్యాకేజీలతో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం మాట్లాడుతూ అత్యుత్తమ సాంకేతికత అందిపుచ్చుకొని మంచి స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, అకాడమిక్ కోఆర్డినేటర్, సిఎస్ విభాగపతి సుజాత, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు


ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. గత నెల 16 నుంచి ఈనెల 12 వరకు 28 రోజులకు గాను 44 లక్షల 59 వేల 63 రూపాయల నగదు, 17 గ్రాముల బంగారం, కేజీ 700 గ్రాముల వెండి, రెండు సింగపూర్ డాలర్స్ వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్ సుజాత, కార్యనిర్వహణ అధికారి బండారు ప్రసాద్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఎన్ రాజారావు, తనిఖీదారు శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పూజారులు, సేవా సభ్యులు, యుబిఐ గవరపాలెం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొత్తూరు ఎర్ర చెరువు చుట్టూ నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులను బుధవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ పనుల్లో నాణ్యత లోపించకూడదని అధికారులను ఆదేశించారు. పెద్దలకు ఆహ్లాదకరంగా, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పార్కు నిర్మించే ప్రదేశాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని, ఈలోగా వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు భీసెట్టి జగన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయితీ శివారు రావలమ్మపాలెంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, గ్రామ సర్పంచ్, సబ్బవరపు నారాయణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లె అప్పారావు, కార్యదర్శి రవి, సచివాలయం కన్వీనర్ గొర్లె నాయుడు, వార్డు సభ్యులు జక్కన శ్రీను, కొల్లి దాసు ,సబ్బవరపు శ్రీను, బోకం శ్రీను,వాలంటీర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి తదితరులు

ప్రజలకు మెరుగైన వైద్యం

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, మేయర్

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. 84వ వార్డు పరిధిలోని కోట్ని వీధిలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్, జీవీఎంసీ సంయుక్తంగా కోటి పది లక్షల రూపాయలతో నిర్మించిన వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని బుధవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం వార్డు ఇన్చార్జ్ కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా పట్టణంలో 7 సచివాలయాల పరిధిలో 20వేల మంది జనాభాకు వైద్య సేవలు అందిస్తామన్నారు. 66 రకాల వైద్య పరీక్షలతో పాటు 101 రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

స్వీపింగ్ మిషన్ ప్రారంభం

అనకాపల్లి జోన్కు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.95 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ను మంత్రి అమర్నాథ్, మేయర్ హరి వెంకట కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారులను శుభ్రపరిచేందుకు ఈ యంత్రం ఎంతో ఉపకరిస్తుందన్నారు. నగర సుందరీకరణలో భాగంగా పార్కుల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మొక్కల పెంపకం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్న లక్ష్మి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హేమంత్, జోనల్ కమిషనర్ వెంకటరమణ, జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి, రత్న కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పలక యశోద, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకి రామరాజు, పలక రవి, జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

గెడ్డ ఆక్రమణపై హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పరవాడ

'దర్జాగా గెడ్డ కబ్జా' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు బుధవారం స్పందించారు. పెదముషిడివాడ రెవెన్యూ సర్వే నెంబరు 100లో 62 సెంట్లు గెడ్డవాగును దానికి అనుకొని ఉన్న జిరాయితీ భూముల్లో రియల్ ఎస్టేట్ ప్లాట్లు వేయడానికి వీలుగా ఆక్రమించి రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ గెడ్డ వాగును పూర్తిగా తవ్వేసి రోడ్డు వేయడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు నామమాత్రపు చర్యలు చేపట్టారు. దీంతో ప్రజాశక్తి కథనం ప్రచురించంతో బుధవారం రెవెన్యూ సిబ్బంది వచ్చి గెడ్డవాగు ఆక్రమించి ఏర్పాటు చేసిన రోడ్డు మధ్యలో హెచ్చరిక బోర్డు పెట్టారు. దీనిపై స్థానిక వీఆర్వో అప్పారావును ప్రజాశక్తి వివరణ కోరుతూ ఆక్రమణ చేసిన వారిని గుర్తించి



ఆక్రమణ స్థలంలో బోర్డు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పోలీసు కేసులు నమోదు చేశారా అని అడగగా ఎవరిపైన ఏ కేసులు నమోదు చేయలేదని తెలిపారు. తాము పెట్టిన బోర్డును మరలా తొలగిస్తే అప్పుడు కేసులు నమోదు చేస్తామని చెప్పారు. దీనిపై తహసీల్దార్ వి ప్రకాశరావును వివరణ కోరగా ఎవరిపైన కేసులు నమోదు చేయలేదని బదులిచ్చారు.

ఆధార్ నవీకరణకు అదనపు భారం

- రూ.50 ధర నిర్ణయం
- కొన్ని చోట్ల రూ.150 వరకు వసూలు చేస్తున్న వైనం



ప్రజాశక్తి - యలమంచిలి

జిల్లాల విభజన అనంతరం కొత్త జిల్లా పేరు నమోదు చేసుకుంటూ అడ్రసు కూడా నవీకరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నీ వ్యక్తిగత గుర్తింపునకు ఆధార్నే అడుగుతున్నాయి. బ్యాంకు ఖాతా తెరవాలన్నా, డ్రైవింగ్ లైసెన్సు పొందాలన్నా, చివరికి ఏదైనా లాడ్జిలో బస చేయాలన్నా, రైలు రిజర్వేషను, తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్లాలన్నా ఆధార్ కార్డు ఉండాల్సిందే. ఆధార్ నవీకరణకు మీ సేవా కేంద్రాల చుట్టూ ప్రజలు చెక్కర్లు కొడుతున్నారు. నవీకరణకు రూ.50 చెల్లిస్తే సరిపోతుందని గురజాడ ప్రభుత్వ కాలేజీ రోడ్డులోని మీసేవ నిర్వహకుడు లోకేష్ చెబుతున్నారు. అయితే యలమంచిలిలోనే మరికొన్ని కేంద్రాల్లో మాత్రం రూ.100, రూ.150 వసూలు చేస్తున్నారని ఆధార్ నవీకరించుకొనే వినియోగదారులు వాపోతున్నారు. జిల్లా పేరుతో పాటు అడ్రసు మార్పు కూడా జరుగుతుంది. జిల్లాపేరు మారినందున చిరునామా కూడా మార్పునకు అధికంగా ఖర్చవుతుందని కేంద్రం నిర్వహకులు చెప్పడం సరికాదని పలువురు అంటున్నారు. ఎక్కువ చెల్లించిన వారు రశీదు అడిగి తీసుకుంటే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందంటుంది. ఈ ఆధార్ కార్డు నవీకరించుకోవడం తప్పనిసరని అధికార్లు చెబుతున్నారు. ఓటరు ఐడి, బ్యాంకు పాస్బుక్ జెరాక్సు కాపీలు తీసుకెళ్లి ఆధార్ కార్డు నవీకరించుకోవచ్చుని మీ సేవ నిర్వహకులు చెబుతున్నారు.

మట్టి నమూనా పరీక్ష ఎంతో ముఖ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం ద్వారా రైతులు తమ భూమి పోషక విలువలు లోపిస్తే సరి చేసుకోవచ్చుని, తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి మోహన్ రావు తెలిపారు. జిల్లా స్థాయి భూసార పరీక్ష, శిక్షణ వారోత్సవాలలో భాగంగా వ్యవసాయ అధికారులకు, రిసోర్స్ పర్సన్స్కు బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలలో మట్టి నమూనా పరీక్షలు ఆర్బికె స్థాయిలో పరీక్షించడం జరుగుతుందని తెలిపారు. భూ శాస్త్రవేత్త డాక్టర్ శిరీష మట్టి నమూనాలు సేకరించు విధానం, మట్టి నమూనాలు తయారు చేయు పద్ధతి, ప్రయోగశాలలో పరీక్షా విధానం, ఫలితాల విశ్లేషణ, సమస్యాత్మక నేలను బాగు చేయు విధానం గురించి తెలియజేశారు. బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీహరి జిల్లాలో నేలల రకాలు, భౌతిక రసాయనిక విధానాలు, భూమి పరిరక్షణ విధానాలు గురించి వివరించారు. శిక్షణలో భాగంగా తుమ్మపాల గ్రామంలో 50 మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, 24 మండలాల రిసోర్స్ పర్సన్స్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న నైరా వ్యవసాయ విద్యార్థులు

రైతులు సాగుబడి పెంచాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని రైతులు సాగుబడిని పెంచాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. మండలంలోని సింగన్నదొరపాలెంలో రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంపై ఆసక్తి లేక పోవడానికి సాగులో యంత్రాల కొరత, తెగుళ్ల సమస్యలు, నీటి కాలుష్యం, అధిక సాగు ఖర్చు, కూలీల కొరత లాంటి సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని అధిగమించడానికి సంబంధిత రైతు సహకార సంఘాలతో అందుబాటులో ఉండి ప్రభుత్వం అందించే రాయితీలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నైరా విద్యార్థులు తేజేశ్వరి, ఎ.వందన, పుష్ప మంజరి, ఉమా, స్నేహలత పాల్గొన్నారు.

బాబోయ్ ఎండలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలంలో ఎండలు మండిపోతున్నాయి. బుధవారం ఉదయం నుండి ఎండ వేడి, ఉక్కపోత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాహనదారులు, ప్రయాణికులు చెట్లు నీడను ఆశ్రయించారు. చల్లని పానీయాలు, కొబ్బరి బొండాలు తాగేందుకు ఆసక్తి చూపారు. సమీపంలో ఉన్న కాలువలు, నేలబావుల్లో యువకులు స్నానాలు చేసి సేదతీరారు. ఎండ వేడి, వడగాలుల వల్ల విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఉపాధి హామీ కూలీలు, రైతులు ఉదయం 10 గంటలకే తమ పనులు ముగించుకొని ఇంటికి చేరారు.

బుచ్చెయ్యపేట : గత రెండు రోజులుగా ఎండలు మండుతున్నాయి. భానుడు భగభగలాడుతుండడంతో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజల విలవిలాడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బుచ్చెయ్యపేట, దిబ్బిడి, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో పనులు ప్రారంభించిన కూలీలు మధ్యాహ్నం మండే ఎండలో ఇంటికొస్తున్నారు. ఎండ వేడితో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి.



మండుటెండలో నడిచి వస్తున్న ఉపాధి హామీ కూలీలు

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్'



మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి – ఆనందపురం: మండలంలో ఆనందపురం గ్రామపంచాయతీలో బుధవారం గడపగడప ప్రభుత్వం కార్యక్రమంలో టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బాలరాజు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, జగన్ పాలనలో మహిళలు సంతోషంగా ఉన్నారని, ఎటువంటి మధ్య దళారీలు లేకుండా వాలంటీర్లు ద్వారా నేరుగా ఇంటివద్దకు పథకాలు అందుతున్నాయని ప్రజలు అంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యనారాయణ, వైస్ ఎంపిపి పాంద్రంకి శ్రీను,, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, చందక సూరిబాబు పాల్గొన్నారు.

ములగాడ : 60వ వార్డు, నెహ్రూ నగర్ సచివాలయం పరిధిలో కార్పొరేటర్ పి.వి సురేష్ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరించారు. టిడిపి పాలనతో పోల్చి చెప్పారు. కరపత్రాలను పంపారు కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పుల్లేటికుర్తి సూర్యారావు. గుల్లల రాజు పాల్గొన్నారు.


సీతమ్మధార: 48వ వార్డు జై భారత్‌నగర్‌లో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలోఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో మంచిని వివరించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, రోడ్లు వీధిదీపాలు తదితర సమస్యలను విన్నవించగా, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్రి రామారెడ్డి, భూలోక్, పి.పద్మ, అప్పారావు, సచివాలయ గృహ సారథులు పద్మావతి, లక్ష్మి, హరినాథ్, మౌనిక, వాలంటరీలు, యువజన విభాగం ఇన్‌ఛార్జి ఎం.సునీల్, షేక్ బాబ్జి, కె చిన్న పాల్గొన్నారు.

సీతమ్మధార : 25వ వార్డులో సచివాలయ కన్వీనర్లు సానబోయిన సురేష్, ముద్దాడ అశోక్ ఆధ్వర్యంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ పాల్గొని, ఇంటింటా ప్రచారం నిర్వహించారు కనకమ్మ వారి వీధిలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జయప్రదం చేసిన సానబోయిన సురేష్ దంపతులను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సత్కరించారు.

రావికమతం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో వెలుగులు నింపారని ఎంపీపీ పైలరాజు, అన్నారు. మండలంలో పలు గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్, గృహసారదులతో కలిసి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ వివరించి మా నమ్మకం నువ్వే జగన్ అంటూ స్టికర్లు అంటించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ్, గొంప సర్పంచ్ కె.గోవింద్, దొండపూడి ఉప సర్పంచ్ రాజారావు, మాజీ సర్పంచ్ తాతబాబు, రాము నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలో పలు గ్రామాల్లో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. గొలుగొండ మండలం కొత్తమల్లంపేటలో సర్పంచ్ పొలిరెడ్డి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి గోడపై స్టికర్లు అతికించారు. వైయస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఏఎల్ పురం పంచాయతీలో మండల వైసిపి సీనియర్ నాయకులు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిపి గజ్జలపు మణికుమారి, ఎంపిటిసి బుల్లి ప్రసాద్, వైసిపి నాయకులు ప్రకాష్‌రావు పాల్గొన్నారు.



గొలుగొండ మండలంలో..

జోగుంపేటలో సచివాలయ కన్వీనర్ జక్కునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పంచాడ నాగరాజు, సచివాలయ గృహ సారధులు కల్లెంపూడి శ్రీను, పంచాడ శ్రీను, వేమల సత్యనారాయణ, జువ్వల నారాయణ, కుపరాల నర్సింగరావు, పైల తాత నాయుడు తెరపల్లి రాజేశ్వరి పాల్గొన్నారు.

వైసిపి నేతలకు నిరసన సెగ

సింహాచలం: జివిఎంసి 98వ వార్డు అడవివరం ప్రాంతంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహణకు వచ్చిన వైసిపి నేతలకు స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. ఇంటింటికీ వచ్చి స్టిక్కర్లు అంటిస్తున్న వైసిపి నేతలను స్థానికులు అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పంచగ్రామాల భూసమస్య, పాత గోశాల నుంచి అడవివరం వరకు అసంపూర్తి బి ఆర్‌టిఎస్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం తదితర అంశాలపై స్థానికులు ప్రశ్నించి నిరసన వెలిబుచ్చారు. అడవివరం ప్రాంతంలో పంచగ్రామాల భూసమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చి, హడావిడి చేసి, నాలుగేళ్లవుతున్నా పరిష్కరించకపోవడంపై నిరసన వెలిబుచ్చారు. దీనిపై స్థానిక వైసిపి నేతలు ఎటువంటి సమాధానం చెప్పకుండానే అర్ధాంతరంగా కార్యక్రమం ముగించి వెనుదిరిగారు.

అర్హులకు సంక్షేమ పథకాలు: ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట:అర్హులైన వారందరికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో రెండో రోజు జగనన్న మా భవిష్యత్, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ధర్మశ్రీ

పథకాలపై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:జగనన్నే మా భవిష్యత్ – జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ రత్నం సమక్షంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వీసం రామకృష్ణ మాట్లాడుతూ, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడపగడపకు వెళ్లి లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా భాగస్వామ్యం కావాలన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్ ప్రజలు ముంగిటకు అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కాసులమ్మ, నక్కపల్లి గ్రామ సర్పంచ్ జయ రత్న కుమారి, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు అయినంపూడి మణి రాజు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న రామకష్ణ



పనులు చేస్తున్న కూలీలు

జోరందుకున్న ఉపాధి హామి పనులు

కనీస సౌకర్యాలు లేక కూలీల అవస్థలు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి, మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లోని ఉపాధి హామీ పనులు జరుగుతూ ఉండగా బుధవారం నాడు 4550 మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నట్లు ఏపీవో గంగు నాయుడు తెలిపారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నట్లు ఉపాధి కూలీలు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం పనులు జరిగే ప్రదేశంలో సామియానా, మెడికల్ కిట్టు, తాగునీటి అలవెన్స్, రవాణా చార్జీలు అందజేసేవారు. ప్రస్తుతం ఎటువంటి అలవెన్సెస్ ఏమీ లేక కూలీలు అవస్థలు పడాల్సి వస్తుంది. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇప్పటికైనా స్పందించి కనీస వసతులు కల్పించాలని కూలీలు కోరుకుంటున్నారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి పాయకరావుపేట:శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో 7వ తరగతి చదువుతున్న ఎం.హంసిని ఫిబ్రవరి 4న సుచిరిండియా ఫౌండేషన్ దేశవ్యాప్తంగా నిర్వహించిన 11వ నేషనల్ ఒలింపియాడ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి సర్ సి.వి రామన్ యంగ్ జీనియస్ అవార్డ్సుకి ఎంపికైనదని వైస్ ప్రిన్సిపల్ ఎం.అపర్ణ తెలిపారు. ఈ విద్యార్థిని ఈ నెల 16 న తెలంగాణా రాష్ట్రంలో నాంపల్లి రవీంద్రభారతీ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు తీసుకోనుందని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినిని విద్యా సంస్థల అధినేత సి.హెచ్. వి. కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

మనోహర్‌ను కలిసిన సూర్యచంద్ర

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను నర్సీపట్నం నియోజకవర్గం పార్టీ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర బుధవారం హైదరాబాద్లో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు విలేకర్లకు సూర్యచంద్ర వెల్లడించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తగు సూచనలు అందించారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను మనోహర్ దృష్టికి తీసుకు వెళ్ళినట్లు తెలిపారు. ఆయనతో పాటు జనసేన నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ ఉన్నారు.

రోడ్డు విస్తరణపై రిట్ పిటిషన్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ప్రధాన రోడ్డు విస్తరణపై రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలయింది. ప్రధాన రోడ్డు విస్తరణ ప్రక్రియను వ్యతిరేకిస్తూ స్థానిక వ్యాపారస్తులు రాష్ట్ర హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా ఈ పిటిషన్ పై వాదనలను వినిపించేందుకు పురపాలక సంఘం సిద్ధమవుతోంది. బుధవారం ఈ మేరకు ఎజెండాలో పొందుపరిచారు. రోడ్డు విస్తరణ పై కోర్టులో పిటిషన్ దాఖలు అయినట్లు ప్రజలకు తేట తెల్లమైంది. రిట్ పిటీషన్ వేసిన వారిలో సయ్యద్ హుస్సేన్, జిఎస్ బంగారాజు, గ్రంధి నాగేశ్వరరావు, డాక్టర్ సి.ఎస్ కుమార్, రావాడ రాము తదితరులు ఉన్నారు. రిట్ ఫిటీషన్ దాఖలు చేసిన వారిలో కౌన్సిల్ తరఫున వాదన వినిపించేందుకు పురపాలక సంఘం 49 వేల రూపాయలు చెల్లించినట్లు అజెండాలో పొందుపరిచారు. బుధవారం కౌన్సిల్ కు మున్సిపల్ అధికారులు ఈ అజెండాను అందించడం జరిగింది. ఇదే అజెండాలో మున్సిపల్ చైర్ పర్సన్ వైస్ చైర్మన్ ల రాజీనామా అంశాలను చేర్చారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి దానిలో ఈ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి అవసరం ఉంది. పట్టణంలో వ్యాపారస్తులు నోటీసులు పూర్తిస్థాయిలో అందుకున్నట్లయితే వ్యాపారస్తులు అందరూ రిట్ పిటీషన్ ఎక్కువమంది వేసే అవకాశాలు ఉన్నట్లు పట్టణంలో వినిపిస్తోంది.

వార్డుల్లో విజయ్ పర్యటన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పీనారిపాలెం ఒకటి, రెండు వార్డులను బుధవారం సందర్శించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు పెద్దలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి వార్డ్ కౌన్సిలర్ లాలం మురళి ఇంటిలో చర్చా గోష్టి నిర్వహించారు. అనంతరం విజయ్ మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ కుటుంబ సభ్యులు పీనారిపాలెం పెద్దలను కలవడం సంప్రదాయంగా వస్తుందన్నారు. రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.



పర్యటిస్తున్న చింతకాయల విజయ్

ప్రజాధనం దుర్వినియోగం : సిపిఐ

ప్రజాశక్తి-గొలుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ఆరోపించారు. గొలుగొండ మండలం గొలుగొండ వీరభద్ర గుడి వద్ద సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ, ఈనెల 14వ తేదీ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని భారత రాజ్యాంగ చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉందన్నారు. రాష్ట్ర ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీల పిలుపు మేరకు నెల రోజుల పాటు ప్రచారం చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మేకా సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కర్ రావు, ఏఐవైఎఫ్ జి.రాధాకృష్ణ, అప్పలనాయుడు, బాబులు దొర, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నేత రామునాయుడు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి కోరారు. బుధవారం నర్సీపట్నంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈబీసీ నేస్తం రెండవ విడత ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రెండవ విడత ఏబీసీ నేస్తం చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని లబ్దిదారులు తిలకించేందుకు వీలుగా ఫంక్షన్ హాల్లో ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని జిల్లా కలెక్టర్ స్క్రీన్ పై వీక్షించారు. అనంతరం జిల్లావ్యాప్తంగా ఉన్న 4864 మంది ఈ బీసీ నేస్తం లబ్దిదారులకు రూ.7 కోట్ల 29 లక్షల 60 వేల చెక్కును ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.పెంటోజీరావు మాట్లాడుతూ, 2021-22 కు సంబంధించి మొదటి విడత ఈబీసీ నేస్తంలో 3077 మంది లబ్దిదారులకు రూ.4కోట్ల,61లక్షల 85 వేలు అందజేశారని, 2022-23కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఈబీసీ నేస్తం లబ్దిదారులు 4864మంది ఉన్నారని, వీరందరికి రెండవ విడతగా రూ.7కోట్ల, 29లక్షల 60 వేలు విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె రాజేశ్వరి, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలా గురువులు, నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి జయరాం, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఎంపీడీవో జయ మాధవి, ఇన్చార్జి తహసిల్దార్ అన్నాజీరావు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, భారీ ఎత్తున లబ్దిదారులు పాల్గొన్నారు.

సర్వే రాళ్లు మార్చితే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి - రావికమతం మండలంలో పలు గ్రామాలలో సర్వే పూర్తయిన ప్రభుత్వ భూములకు సంబంధించి సరిహద్దులలో అధికారికంగా పాతిపెట్టిన సర్వే రాళ్లు కదిపినా, వాటి స్థానం మార్చి తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి హెచ్చరించారు. మండలంలో పెదపాచలి రెవెన్యూ భూములలో బుధవారం స్థానిక రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ స్థలాల సరిహద్దుల్లో పాతుతున్న సర్వే రాళ్ల పనులను ఆయన తనిఖీ చేశారు ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ, గ్రామస్తులు, రైతుల సమక్షంలోనే ప్రభుత్వ భూమి సరిహద్దులకు రాళ్లు పాతాలని సూచించారు. వీటిపై ఎటువంటి అభ్యంతరాలు లేవని నిర్ధారించుకున్న తర్వాతనే సర్వే రాళ్ళు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో 143 గ్రామాలలో ప్రభుత్వ భూమి గుర్తించి సర్వే రాళ్ల పాతడం పూర్తయిందన్నారు వచ్చే నెల 10లోపు రెండవ దశలో మిగిలిన గ్రామాలలో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. రావికమతం మండలానికి సంబంధించి 11 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయింది ప్రభుత్వ భూములు గుర్తించామని వీటికి సంబంధించి సర్వే రాళ్లు ఏర్పాటు జరుగుతుందన్నారు. రెండవ దశలో 8 గ్రామాల్లో ప్రభుత్వ భూమి గుర్తించి రాళ్లు పాతిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ జయరాం, తహసిల్దార్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్

ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విద్యార్థులకు ఉపయుక్తంగా డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ అందించే ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీని ప్రారంభిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఏయూ హెలిపాడ్ గ్రౌండ్‌ను ఆనుకుని నూతనంగా ఏర్పాటుచేసిన ఐసిడిటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, రోసిన్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తొలిసారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏయూలో ఏ కోర్సు చదివే విద్యార్థులైనా ఇక్కడ అందించే కోర్సులలో చేరి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. ఏయూతో పాటు విశాఖలోని ఏ కళాశాల విద్యార్థి అయినా ఇక్కడ శిక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, ప్రిన్సిపల్స్ ఆచార్యులు జి.శశిభూషణరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలమాంబ ఆదాయం రూ.2.70 లక్షలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పెదవాల్తేరులో ఇటీవల జరిగిన శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మారువారం హుండీలు బుధవారం లెక్కించారు. 5 రోజులకు రూ.2,70,295 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి డివిఎస్.సురేష్ బాబా తెలిపారు. ఈ లెక్కింపులో పర్యవేక్షణాధికారి ప్రసన్నలక్ష్మి, దేవస్థానం ఛైర్మన్ పి.శంకర్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు మాదు మంగరాజు, నీలాపు నైటమ్మ, నండూరి కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా గిరిబాబు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా అప్పారి గిరిబాబు నియమితులయ్యారు. ఆయన ఒక సంవత్సర కాలం పాటు కౌన్సిల్‌కు సేవలందించనున్నారు.

సిద్ధాంతాలకు కట్టుబడ్డ నేత రొంగలి కృష్ణ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సామ్యవాద సిద్ధాంతానికి, విలువలకు కట్టుబడి పనిచేసిన గొప్ప వ్యక్తి రొంగలి కృష్ణ అని ముఠా కళాసీల సంఘం గౌరవాధ్యక్షుడు వై.రాజు అన్నారు. ముఠా కళాసీల యూనియన్ నాయకుడు రొంగలి కృష్ణ శనివారం మృతిచెందడంతో బుధవారం ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు అధ్యక్షతన పూర్ణ మార్కెట్ స్ప్రింగ్ రోడ్డు జంక్షన్‌లో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ముఠా కళాశీల యూనియన్ గౌరవాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ, కార్మికులను కొన్ని శక్తులు విడదీయడానికి ప్రయత్నిస్తుంటే రొంగలి కృష్ణ పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా రొంగలి కృష్ణ చిత్రపటానికి కళాసి యూనియన్ నాయకులు పైడిరాజు, సంజీవ్, మహేష్, నాయుడు పూలమాలలు వేసి రొంగలి కృష్ణకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, ముఠా కళాసీలు పాల్గొన్నారు.

15 నుంచి ఫుట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ ట్రోఫీ ఇన్విటేషన్ ఆలిండియా ఫుట్ బాల్ టోర్నమెంటు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు రైల్వే గ్రౌండ్స్‌లో సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు రోజుకు రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు పిఎఫ్ఎస్ఎల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ఎస్‌వి.దిలీప్‌వర్మ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టోర్నమెంట్‌లో తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం, కోల్‌కత్తా, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మొత్తము 16 టీములు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఏ కారణం చేతనైనా మ్యాచ్ డ్రా అయితే టై బ్రేకర్ పద్ధతిలో విజేతలను నిర్ణయించనున్నట్లు తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్‌వి.ఆదినారాయణరావు సలహాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎస్‌వి.ఆదినారాయణరావు, కెవిఎస్‌వి.ప్రసాద్, భోగాది స్వామినాయుడు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గొలుగొండ:ఆపదలో ఉన్న నిరుపేదలకి సహాయం అందించడంలోనే తమకు సంతృప్తి వస్తుందని స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధి ఎం.చిట్టయ్య అన్నారు. గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో రెండు కిడ్నీలూ ఫెయిల్ అయి డయాలసిస్ చేయించుకొంటూ ఇబ్బంది పడుతున్న నిరుపేద జాగు సత్తిబాబుని పరామర్శించారు. స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ తరపున రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా చిట్టియ్య మాట్లాడుతూ, ఈ సంస్థ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సంస్థ మహిళ ప్రతినిధి సూర్యకళ మాట్లాడుతూ భవిష్యత్‌లో నిరుపేదలని గుర్తించి తమకు తోచిన సహాయం అందించడమే మా స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుజాత, నల్లయ్య పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న సంస్థ సభ్యులు



నిర్మానుష్యంగా ఏఎల్‌పురం రహదారి

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో బుధవారం ఎండ తీవ్రస్థాయిలో కాసింది. సుమారుగా 42 డిగ్రీల పై మాటే. ఒకవైపు ఎండ తీవ్రత మరోవైపు ఒక పోతతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరయ్యారు. తీవ్రమైన ఎండకి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 వరకు ప్రజలు బయటికి రావడానికి భయపడ్డారు. వృద్ధులు చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు ఏఎల్‌పురం, గొలుగొండ, చీడిగుమ్మల ప్రధాన రహదారులంతా 10 గంటల నుంచి నిర్మానుష్యమయ్యాయి.

అంబులెన్స్ లేక అవస్థలు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ పిహెచ్‌సి ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలు నిలబెట్టే అంబులెన్స్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏఎల్‌పురం ఆసుపత్రికి ఐటిడిఎ వారు అంబులెన్స్‌ను అందుబాటులో తెచ్చారు. తర్వాత ఉన్న ఆ ఒక్క అంబులెన్స్‌ను విశాఖపట్నం తరలించారు. దీంతో ఇక్కడ అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రికి వచ్చే రోగులు మాత్రం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. రాత్రి సమయంలో రోగుల కష్టాలు మరీ దారుణం. ఈ ఆసుపత్రికి కొయ్యూరు మండలం నుంచి 40 గ్రామాల ప్రజలు, గొలుగొండ మండలం సగం గ్రామాల ప్రజలకు ఈ ఆసుపత్రే ఆధారం. ఇలాంటి ఆసుపత్రిలో అంబులెన్స్ లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అంబులెన్స్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



పిహెచ్‌సి

ధ్రువపత్రాల జారీకి ఒటిపి తంటా

-మున్సిపల్ కార్యాలయం వద్ద వినియోగదారుల పడిగాపులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక మునిసిపాలిటీలో జనన మరణ ధ్రువపత్రాలు జారీ చేయాలంటే ఇప్పట్లో పని అయ్యేలా లేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు. జనన మరణ ధ్రువపత్రాలు పొందేందుకు అనేక తంటాలు పడుతున్నారు. వినియోగదారుడు జనన మరణ ధ్రువపత్రాలకు మీ సేవలో లేదా సచివాలయంలో నమోదు చేసుకున్న తర్వాత సంబంధిత తహశీల్దారు, ఆర్డీవో కార్యాలయానికి వెళుతుంది. అక్కడ పూర్తి పరిశీలన అనంతరం మున్సిపాలిటీకి వస్తుంది. మునిసిపాలిటీ నుండి ఈ పత్రాన్ని వినియోగదారుడు పొందాలి. తహసీల్దార్ కార్యాలయం ఆర్డీవో కార్యాలయంలో పూర్తి పరిశీలన అయిపోయినప్పటికీ మున్సిపాలిటీలో ఈ పత్రాలు పొందేందుకు ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. మునిసిపాలిటీలో పరిశీలన అయిన తర్వాత లాగిన్‌లో ఓపెన్ అయి ఆ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంది. లాగిన్ అవ్వాలంటే సంబంధిత అధికారుల సెల్‌కు ఓటిపి వస్తుంది. ఈ ఓటిపి ద్వారానే లాగిన్ అవ్వాలి. ఓటిపి వచ్చే సిమ్ కార్డుకు ఈ నెలలో ఇప్పటివరకు ప్రభుత్వం డబ్బులు చెల్లించక పోవడంతో ఆ సిమ్ కార్డు కాస్త నిలిచి పోయింది. ఇక్కడే అసలైన తంటా ఏర్పడింది. సిమ్ కార్డు పని చేయకపోవడంతో ఓటిపి రాకపోవడంతో మునిసిపాలిటీ లాగిన్‌లోని ఆ పత్రాన్ని వినియోగదారుడుకు అందించలేక పోతున్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పేందుకు మున్సిపాలిటీ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. దీంతో వినియోగదారుడు కార్యాలయం చుట్టూ పది రోజుల నుండి తిరుగుతున్నప్పటికీ మరణ దవపత్రాన్ని పొందలేకపోతున్నాడు. పెద్ద బొడ్డేపల్లికి చెందిన రెడ్డి నూకన్న మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు భూమి పంపకాలకై మరణ దవపత్రం అవసరం వచ్చింది. ఈ నేపథ్యంలో పత్రం కొరకు మీ సేవలో నమోదు చేసి అన్ని కార్యాలయాలు చుట్టూ తిరిగి అధికారులతో పూర్తి పరిశీలన చేయించుకున్నప్పటికీ మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ పత్రాన్ని తీసుకునేందుకు వెళ్లగా మున్సిపాలిటీ లాగిన్ అవటానికి ఓటిపి రాలేదని సిమ్ కార్డు పనిచేయలేదని సిమ్ కార్డు పనిచేయాలంటే సిమ్ కార్డుకు తగినంత బ్యాలెన్స్ ప్రభుత్వాలు చెల్లించాల్సి ఉందని రెడ్డి నూకన్న కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో విస్తుపోయారు. ప్రభుత్వం ఎప్పుడు సిమ్ కార్డుకు రీఛార్జ్ చేస్తుంది. ఓటీపీ ఎప్పుడు వస్తుందో మా ధ్రువత్రాన్ని మేము ఎప్పుడు పొందుతామో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ఈ సిమ్ కార్డులను ఎప్పటికి రీఛార్జ్ చేస్తుందో ప్రజలకు వినియోగదారులకు దవపత్రాలు తీసుకునే కష్టాలు ఎప్పుడు తీరుతాయో తెలియని పరిస్థితిలో మున్సిపాలిటీ కొట్టు మిట్టాడుతుంది.



మున్సిపల్ కార్యాలయం